మొత్తంగా ఈ ప్రాంతంలో పట్టుకున్న వాళ్లలో 10 మందిపై అక్రమ కేసులు మోపి జైలుకు పంపించారు – నాయుంపార గ్రామానికి చెందిన మద్కామి ముసుర్ (32), ఓయామి కుమ్మా (45), మాడివి గుడ్డి (55), బోడగా గ్రామానికి చెందిన  ఓయామి బుదు (33), ఓయామి హిడ్‌మా (35), బడేపల్లి గ్రామానికి చెందిన ఓయామి చైతు (40), పదామి సోముడు (35), కుమ్‌నార్‌కు చెందిన ఓయామి బుధ్రు (23), గోంగ్ల గ్రామానికి చెందిన ఓయామి లచ్చు (25), జీలి గ్రామానికి చెందిన కుంజాం సుధ్రు (35).

## కుత్తుల్ ప్రాంతంలో జరిగిన దాడి

జిల్లా కేంద్రమైన నారాయణ్‌పూర్‌లో ఈ దాడికి సన్నాహాలు మార్చ్ 5 నుండే మొదలయ్యాయి. మాడ్‌పై దాడి జరగబోతున్నదని అర్థమైన నారాయణ్‌పూర్ వ్యాపారస్తులు 12న మాడ్‌లో ఒక ప్రముఖ కేంద్రమైన సోన్‌పూర్ గ్రామంలో జరగాల్సిన సంతకు రాలేదు. కాబట్టి ఆరోజు సంత జరగలేదు. 13 రాత్రి బలగాలు బయలుదేరాయి. 14న వివిధ సాయుధ బలగాలకు చెందిన దాదాపు వెయ్యి మంది కోహ్కామెట్ట గ్రామం చేరుకొని వంటలు చేసుకొని తిన్నారు. ప్రజల్ని పక్కదారి పట్టించడం కోసం వాళ్లు వేరే వైపు పోతున్నట్టుగా నటించారు. ఆ తర్వాత ఇరక్‌భట్టి గ్రామం మీదుగా కచ్చాపాల్ గ్రామ పొలిమేరల్లోకి చేరుకున్నారు. ఊళ్లో నుండి పొలాల వైపు పోయే తోవకు ఆంబుష్ కూర్చున్నారు.

కచ్చాపాల్‌కు చెందిన సోను, రాజు అనే ఇద్దరు గ్రామస్తులు 'గోర్గ' (జీలుగు) కల్లు తాగడం కోసం పోతూ ఈ ఆంబుష్‌లో ఇరుక్కున్నారు. సాయుధ మూకలు వీళ్లపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. సోను కాలికి తూటా తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అయినప్పటికీ అతను పరుగెత్తి తప్పించుకున్నాడు. రాజు మాత్రం పోలీసుల చేతికి చిక్కిపోయాడు. అతన్ని పట్టుకొని విపరీతంగా కొట్టి వదిలేశారు. ఆ దెబ్బల వలన ఇప్పటికీ అతనికి నోట్లోంచి రక్తం వస్తున్నది.


బోతల్ దుంగ

ఇదే ప్రాంతంలో మరోచోట ఆంబుష్ కూర్చున్న పోలీసులకు పి.ఎల్.జి.ఏ. టీం ఒకటి ఎదురుపడింది. పోలీసులు విపరీతంగా కాల్పులు జరిపినప్పటికీ గెరిల్లాలు ఎటువంటి నష్టం లేకుండా సురక్షితంగా తప్పుకోగల్గారు.

## తోకె గ్రామంలో సాగించిన విధ్వంసం

15 సాయంత్రం 3 గంటలకు తోకె గ్రామంలోకి జొరబడే ముందు గ్రామ శివార్లలో ప్రజా మిలిషియా సెంట్రీ వుండే జాగను క్లియర్ చేసుకోవడానికి విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఏమీ కాలేదు. తర్వాత




సాయుధ బలగాల చేతిలో హత్యకు గురైన దుంగ ధుర్వా సమాధి (ఇన్‌సెట్‌లో భార్య)

గ్రామాన్ని చుట్టుముట్టి ప్రజలపై విరుచుకుపడ్డారు.

కేయె ధుర్వా అనే రైతు ఇంటిని పూర్తిగా కాలబెట్టారు. ఇంటితో పాటు ఇంట్లో వున్న సామాను, బియ్యం, కోహల ధాన్యం, బట్టలు, వంటపాత్రలు, 16 వేల రూపాయల నగదు కాలిపోయాయి. ఒక పంది కూడా మంటల్లో చిక్కుకొని కాలి చనిపోయింది.

బోతల్ దుంగ (45) అనే ఆదివాసీ కాళ్లకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతను నడవలేడు. ఇతన్ని బాగా కొట్టి ఈడ్చుకుపోతుంటే పక్కటెముకల ప్రాంతంలో గాయమై రక్తం కారింది. తర్వాత ఈ రైతు చేతిలో 20 రూపాయలు పెట్టబోయారు. తీసుకోవడానికి అతను నిరాకరిస్తే, అతని ముందు పడేసి పోయారు. ఇదీ వీళ్లు 'ప్రజల హృదయాల్నీ, మనస్సుల్నీ గెల్చుకునే' తీరు!

తర్వాత దుంగ ధుర్వా (38) అనే రైతు 'గోర్గ' కల్లు తాగిన మైకంలో చేతిలో గొడ్డలి, విల్లుబాణాలతోనే గ్రామంలోని గోటుల్ (ప్రజల సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాల కేంద్రం) వైపు పోగా పోలీసులు అతన్ని పట్టుకున్నారు. గోటుల్‌లో వున్న డోళ్లను పోలీసులు కత్తులతో కోసేస్తుంటే అతను వద్దని వారించబోయాడు. దాంతో అతన్ని విపరీతంగా కొట్టి, తుపాకీ మడమలతో బాది అక్కడికక్కడే ప్రాణాలు తీశారు. దుంగకు భార్యాపిల్లలున్నారు.

మున్న పుల్‌సో (20) ఇంటి మీద దాడి చేసి వంటపాత్రల్ని పగులగొట్టారు. మూడు కోళ్లు ఎత్తుకెళ్లారు. వీళ్ల ఇంటి పక్కనే మరో ఇంట్లో కూడా గిన్నెలను నేలకేసి కొట్టి రెండు డోళ్లను